క్లుప్తంగా

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీరామలింగేశ్వరస్వామి

మంత్రాలయం: మండల కేంద్రంలోని పాతవూరులో వెలసిన శ్రీ రామలింగేశ్వరస్వామికి సోమవారం పూజారీ వీరేష్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచి స్వామి వారికి జల, పుష్ప, క్షీర, పంచామృతం, రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించి హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్య తరలివచ్చారు.

క్రిష్ణమ్మను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

ఆదోని అర్బన్: వాస్తవాలు రాసే ఓ విలేకరిపై చర్యలు తీసుకోవాలని అనవసరంగా డీఎస్పీకి ఫిర్యాదు చేసిన టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ గుడిసె క్రిష్ణమ్మను టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని జర్నలిస్టు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక భీమాస్ కూడలి నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టు సంఘం నాయకులు దేవదాస్, మల్లికార్జున, బసవరాజ్, విజయ్, ఉసేన్, రాము, ప్రసాద్ మాట్లాడారు. వాస్తవాలు రాసే విలేకరిపై కేసులు పెట్టాలని పురమాయించడం ఏమిటని ప్రశ్నించారు. వాస్తవాలు రాస్తే బెదిరించడం తగదన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐ గంగాధర్, ఎంపీడీఓ మణి మంజరి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రం గోనెగండ్లలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో వీఓఏలు, అంగన్‌వాడీ వర్కర్స్, సంఘ మిత్రలకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం కోసం మండల స్థాయి కార్యచరణ ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఈనెల 25 నుంచి డిసెంబర్ 23 వరకు సదస్సులను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేన, ఏపీఎం హేమలత, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మానవసేవే మాధవసేవ


భోజనాలు వడ్డిస్తున్న విద్యార్థులు

కౌతాళం: మానవసేవే మాధవ సేవ అని ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా అన్నారు. పాఠశాల పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులు ఆదోనిలోని జీవనజ్యోతి వృద్ధాశ్రమానికి వెళ్లి అక్కడ ఉన్న వృద్ధులకు కావాల్సిన నిత్యావసర వస్తువులను అందించడంతో పాటు భోజనాలను వడ్డించారు. ఉపాధ్యాయు లు జయలక్ష్మి, శిరీష, నాగరాజు, జయరాం, పాఠశాల సెక్రటరీ మైనుద్దీన్‌లు పాల్గొన్నారు

వివాహిత అదృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన భారతి అనే వివాహిత నెల రోజుల నుంచి కనిపించడం లేదని భర్త శంకర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని సీఐ సూర్యమోహన్‌రావు సోమవారం తెలిపారు. నెల రోజుల నుంచి ఆయా ప్రాంతాల్లో, వారి బంధువుల ఇంట్లో వెతికినా కనిపించకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

పోస్టాఫీసులో అకౌంట్ ఓపెన్ చేసుకోండి

హొళగుంద: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు రూ.200కే పోస్టాఫీసులో ఎన్‌పీసీఐ లింక్ అకౌంట్‌ను పొందవచ్చని పోస్ట్‌మాస్టర్ వెంకటేష్ తెలిపారు. సోమవారం స్థానిక పాత పోలీస్‌స్టేషన్ ఎదుట ఎన్‌పీసీఐ లింక్ అకౌంట్‌ను ఓపెన్ చేసుకోవడానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆధార్‌కార్డ్, ఫొటోలు లేకుండా కేవలం ఆధార్ నెంబర్‌తో అకౌంట్ ఓపెన్ చేసుకోవచ్చన్నారు.

పేటీఎం ద్వారా రుణాల చెల్లింపు

తుగ్గలి : స్త్రీ నిధి రుణాలు తీసుకున్న స్వయంశక్తి సంఘాలు రుణ చెల్లింపు వాయిదాలను పేటీఎం యాప్ ద్వారానే చెల్లించవచ్చని వెలుగు ఏపీఎం రాధాకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ..స్త్రీ నిధి రుణాలు రికవరీ డిజిటల్ విధానంలో జరగాలన్నారు. సక్రమంగా చెల్లించే సంఘాల సభ్యులకే స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు.

మండుతున్న ధరలు.. నాణ్యతకు ఎసరు

- విపరీతంగా పెరిగిన నిత్యావసరాల ధరలు
- మెస్ బిల్లు పెంచని కూటమి ప్రభుత్వం
- భారంగా మారిన మధ్యాహ్న భోజన నిర్వహణ
- వంటకాల్లో నాణ్యత పాటించని నిర్వాహకులు
- విద్యార్థులకు అందని పౌష్టికాహారం


పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: నిత్యావసరాల ధరలు మండిపోతుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత కొరవడుతోంది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు- నేడు పథకంతో బడి రూపు రేఖలను మార్చడమే కాకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు కృషి చేసింది. అందులో భాగంగానే ప్రతి రోజూ ఒక రకం భోజనం ఉండాలని మెనూ ప్రకటించి, అందుకు తగ్గట్టుగానే నిధులను కేటాయించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్‌ను పెంచడం లేదు. దీంతో మధ్యాహ్న భోజన నిర్వహణ భారంగా మారి నిర్వాహకులు నాణ్యతకు తిలోదాకాలు ఇస్తున్నారు.

నియోజకవర్గంలో 30 వేల మంది విద్యార్థులు

ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వ, పురపాలక, ఎయిడెడ్ పాఠశాలలు 126 ఉన్నాయి. అయా పాఠశాలల్లో 30,000 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులంతా పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలే. వారిలో ఏ ఒక్కరు కూడా రక్తహీనతతో బాధపడకూడదు. పిల్లలు అందరు ఆరోగ్యవంతులు ఉండాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెనూలో పలు మార్పులు చేసి మధ్యాహ్న భోజనం అందించింది. రోజుకు ఒక రకం వంటకంతో పాటు ఉడికించిన గుడ్లు, చిక్కి, రాగిజావ వంటివి అదనంగా అందిస్తూ వచ్చారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపడానికి ఆసక్తి చూపే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీనికితోడు నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు మండుతున్నాయి. దీంతో వంట నిర్వాహకులకు మధ్యాహ్నభోజన పథకం నిర్వహణ భారంగా మారింది. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్నిచోట్ల వంట నిర్వాహకులను మార్చి తమకు అనుకూలమైన వారిని నియమించుకున్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి.

పెరిగిన నిత్యావసరాల ధరలు

ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి ఒక్కొక్కరికి రూ.5.88, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రూ. 8.57లను నిర్వాహకులకు అందిస్తుంది. ప్రస్తుతం నిత్యావసర సరకులతో పాటు, కూరగాయలు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. మరి ఏవిధంగా సరకులను కొని భోజనం అందించాలని నిర్వాహకులు వాపోతున్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సన్నబియ్యం అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకులు స్టోర్ బియ్యాన్నే సరఫరా చేస్తున్నారు.

పెండింగ్‌లో ఎండీఎం నిధులు

మధ్యాహ్న భోజనానికి చెల్లించాల్సిన నిధులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు మూడు, నాలుగు నెలలు నుంచి అందడం లేదు. దీంతో పూర్తి స్థాయిలో పౌష్టికాహారం అందించడానికి అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ధరలు అకాశాన్ని అంటుతుండటంతో విద్యార్థులకు రుచికరమైన భోజనం వండలేకపోతున్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.

రుచికరమైన భోజనం అందించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్నభోజనంలో నాణ్యత కొరవడింది. తాము అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం పంపిణీ చేసి నాణ్యమైన భోజనం అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. స్టోర్ బియ్యాన్నే పంపిణీ చేయడంతో అన్నం ముద్దగా ఏర్పడుతుంది. దీంతో విద్యార్థులు తినడానికి ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు చేపట్టాలి.

– శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు ఆదోని

ఎండీఎం బిల్లులు చెల్లించాలి



పెరిగిన ధరలకు అనుగుణంగా ఎండీఎం బిల్లులు చెల్లించాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరకులతో పాటు కూరగాయల ధరలు పెరిగాయి. దీంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను కూడా పెంచాలి. మధ్యా హ్న భోజన కార్మికులకు కూడా గౌరవ వేతనం పెంచి పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించాలి.

– బి. వీరేష్ డీవైఎఫ్ఐ జిల్లా సహ అధ్యక్షుడు

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి


సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు శ్రీనివాసరాజు, వేణుసూర్య, డీఎల్‌డీపీఓ నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

సహస్ర దీపోత్సవం


గుడేకల్‌లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామి దేవాలయంలో కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని సహస్ర దీపోత్సవం నిర్వహించారు. దీపోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దీపాలను వెలిగించారు.

ఈరన్నస్వామికి అభిషేక పూజలు


స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


దర్శనానికి బారులు తీరిన భక్తులు


కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి కార్తీక మాసం చివరి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. ఆలయంలో కొందరు భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు దేవాలయం ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. కార్తీక దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.

మహిళల చైతన్యంతో సమాజాభివృద్ధి


మాట్లాడుతున్న ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య

కోసిగి: ప్రతి ఇంటిలో మహిళ చైతన్యవంతురాలైతే ఆ కుటుంబం బాగుపడుతుందని, మహిళలందరూ చైతన్యవంతులైతే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య, స్త్రీశిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్ విజయకుమారి అన్నారు. సోమ వారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కోసిగి, కౌతాళం, మంత్రాలయం మండలాలలోని మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఆర్డీటీ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళ హింస వ్యతిరేకంగా నినాదాలు చేసి ప్రతిజ్ఞ చేపట్టారు. వారు మాట్లాడుతూ ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ విద్యకు, మహిళాభివృద్ధి ఎంతో కృషి చేస్తుందన్నారు. 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే వారి ఉన్నత చదువులకు ఆర్డీటీ సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు హిమబిందు, సూపర్ వైజర్ కాత్యాయిని, ఆర్డీటీసీ సీసీ నాగేంద్ర, సిబ్బంది వీరేష్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నందవరం : మహిళలు, చిన్నారులపై జరుగుతున్న హింసలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, భావితరాలు బాగుండాలంటే స్త్రీలను గౌరవించాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలను అరికట్టాలని, అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు వచ్చిన తరువాత వివాహాలను చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు అంకిత ప్రియదర్శిని, ఆర్డీటీ సంస్థ ఏరియా కోర్డినేటర్ నాగసుదర్శన్‌రెడ్డి, సీఓలు బాబు, ధనుంజయ్య పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌తో మానసిక స్థితిపై ప్రభావం


మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్

ఆలూరు రూరల్: సెల్‌ఫోన్ వాడకం మానసిక స్థితి, శారీరక ఎదుగుదలపై ప్రభావం చూపుతోందని ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో సామాజిక మాధ్యమం–లాభ నష్టాలు అనే అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడారు. దశాబ్దం క్రితం విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలలో మునిగితేలేవారన్నారు. నేడు వయస్సుతో నిమిత్తం లేకుండా పిల్లలు,పెద్దలు సెల్‌ఫోన్‌లో సోషల్ మీడియాతో కాలక్షేపం చేస్తున్నారని చెప్పారు. దీంతో శారీరక, మానసిక సమస్యలపై తీవ్ర ప్రభావం చూపి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఇంటర్నెట్‌ను చదువు పరంగా సందేహాలు నివృత్తి కోసం వాడుకుంటే లక్ష్యాలను చేరుకోగలతారని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది రవి ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ మాధవి అధ్యాపకులు సుశీల, లక్ష్మీనరసమ్మ, డా.రాఘవేంద్ర,డా.మద్దప్ప పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం


అసిస్టెంట్ కమిషనర్‌కు అర్జీ సమర్పిస్తున్న ప్రజలు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని మున్సిపల్ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ అన్నారు. సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డులకు చెందిన ప్రజలు తాగు నీటి సరఫరా, మురుగు కాలువల శుభ్రం, తాగునీటి సరఫరాలో వేళలు పాటించడంలేదని, అక్రమ కట్టడాలు కూల్చాలని కొంతమంది ప్రజలు అసిస్టెంట్ కమిషనర్‌కు అర్జీలు చేసుకున్నారు. స్పందించిన అసిస్టెంట్ కమిషనర్ విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. అక్రమ కట్టడాల వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని, వాటిపై దృష్టి సారించాలని ప్రజలు ఆమెను కోరారు.

గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలి


ఊరేగింపుగా వస్తున్న గంగపుత్ర సభ్యులు

మంత్రాలయం: గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలని గంగపుత్ర సంఘం అధ్యక్షుడు శాంతయ్య అన్నారు. మండల కేంద్రంలో సోమవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన భోజన కార్యక్రమం పండుగ వాతవరణంలో ఘనంగా ముగిసింది. ముందుగా తుంగభద్ర నది తీరంలో వెలసిన గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు, యువతులు కళశాలతో చేపట్టిన ఊరేగింపు ఎంటీఆర్, రాఘవేంద్ర సర్కిల్, ప్రధాన రహదారి మీదుగా గ్రామ శివారులోని అభయాంజనేయ్యస్వామి దేవాలయం వద్ద ఉన్న ఊసిరి వనం వరకు సాగింది. గంగమ్మమాత, భీష్మ మహర్షి చిత్ర పటాలను ఊరేగింపుల్లో ప్రదర్శించారు. యువకుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ ఏడాది చదువుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారి తల్లితండ్రులకు సన్మానం చేశారు. ఊసిరివనంలో చెట్టుకు ప్రత్యేక పూజలు చేపట్టి భోజన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య, బొంబాయిశివ, సుంకప్ప, నరసింహా, భీమయ్య, హనుమంతు, రామయ్య, తిప్పయ్య, నరసింహాప్ప, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు జేసీ అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): నవంబర్ 16 నుంచి 18వ తేదీ వరకు గుడివాడలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ –19 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కర్నూలు జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరచారు. 76 కేజీల విభాగంలో ఎం.పుష్పాంజలి స్వర్ణం, 102 కేజీల విభాగంలో బి.నవీన్ స్వర్ణం, 87 కేజీల విభాగంలో ఎస్.లోహిత కాంస్యం, 102 కేజీల విభాగంలో బి.శేషు కాంస్య పథకాలను సాధించారు. వీరంతా డిసెంబర్‌లో ఢిల్లీలో జరిగే 68వ జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–19 వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే ఈనెల 23, 24 తేదీల్లో రేణిగుంటలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 19 జూడో పోటీల్లో 73 కేజీల విభాగంలో ఇర్ ఇసాక్ వెండి, 90 కేజీల విభాగంలో బి.శేషు కాంస్య పథకాలను సాధించారు. పథకాలు సాధించిన క్రీడాకారులను సునయన ఆడోరియంలో జేసీ డాక్టర్ బి.నవ్య అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. డీఎస్‌డీఓ భూపతి, డీవీఈఓ పరమేశ్వరరెడ్డి, క్రీడల కోచ్‌లు యూసుఫ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించండి


విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈఓ రామ్మూర్తి

పెద్దకడబూరు : వంట ఏజెన్సీలు మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పక పాటించాలని మండల విద్యాధికారి రామ్మూర్తి సూచించారు. మండల పరిధిలోని కల్లుకుంట ఉర్దూ పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా, వారిని ఆకట్టుకునే విధంగా బోధించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనాన్ని ఆరగించారు.

మిరప రైతుకు నష్టపరిహారం ఇవ్వాలి


తహసీల్దారు శ్రీనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : పెద్దకడబూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినా మిరప పంటకు నష్టపరిహారం ఇవ్వకపోవడం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు పరమేష్ అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దారు శ్రీనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ అరకొరగా పండిన మిరుప పంటకు కనీస ధర క్వింటాకు రూ. 25వేలు ఇవ్వాలన్నారు. వరికి రూ. 3వేలు మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేసి రైతు ఆత్మహత్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు ఈరన్న, ఓబులేసు, భగవంతప్ప తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కె.లక్ష్మిరెడ్డి

ఆదోని రూరల్: ఈనెల 26న చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కె.లక్ష్మిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయంలో సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం మున్సిపల్ మైదానం నుంచి స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు రైతు సంఘాలు, కార్మిక సంఘాల సమక్షంలో పెద్ద ఎత్తున ర్యాలీ, ధర్నా కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, ఏపీ రైతు సంఘం నాయకులు బసాపురం గోపాల్, పట్టణ సహాయ కార్యదర్శి విజయ్, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి రమేష్, సీపీఐ నాయకులు హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

29న మాదిగల ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గప్ప

కోసిగి: కర్నూలులోని కోల్స్ కళాశాల గ్రౌండ్‌లో ఈనెల 29వ తేదీన నిర్వహిస్తున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గప్ప, తాలుకా కన్వీనర్ నాగరాజు, మండల అధికార ప్రతినిధి నరసింహులు పిలుపునిచ్చారు. సోమవారం కోసిగిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సామేల్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశమై కార్యచరణపై చర్చించారు. మండలంలోని ప్రతి మాదిగ విద్యార్థులు, నాయకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి చిదానంద, ప్రచార కార్యదర్శి సునందరాజు, మండల ఉపాధ్యక్షుడు ఈరన్న, మండల సహాయ కార్యదర్శి అంజి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి


మొయిన్‌రోడ్డులో ముళ్లకంపను తొలగించిన దృశ్యం

కౌతాళం: బాపురం గ్రామాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తామని సర్పంచ్ శిల్పారెడ్డి, గ్రామ నాయకుడు గురునాథ్‌రెడ్డి అన్నారు. గ్రామంలో డ్రైనేజీల్లో పేరుకుని పోయిన మట్టిని తొలగించడంతో పాటు పాఠశాల మొయిన్ రోడ్డు వద్ద, గ్రామం నుంచి ఆగసలదిన్నె వెళ్లే రోడ్డుకు ఇరువైపుల ముళ్ల కంపలను తొలగించినట్లు వారు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో నిరంతరంగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఇప్పటికే గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పా టు చేయడం, వంకకు బ్రిడ్జి నిర్మాణం లాంటి ఎన్నో పనులు చేపట్టినట్లు తెలిపారు.